క్లుప్తంగా

దేవతామూర్తుల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపులో గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో సోమవారం దేవతామూర్తుల విగ్రహాలను గ్రామస్తులు ఊరేగించారు. మహాపోచమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవంలోభాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించా రు. బుధవారం మహాపోచమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భూమిపూజ

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో సోమవారం జెడ్పీ నిధులు రూ.రెండు లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, బండి ప్రశాంత్, భోజన్న, శంకర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భోజారెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్ ఉన్నారు.

వరి పంటలు పరిశీలన

లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్ గ్రామాల్లోని వరి పంటలను సోమవారం ఏఈవో భూమేశ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈవో మాట్లాడుతూ వరి పంటను ఆశిస్తున్న మొగి పురుగు నివారణకు కాటఫ్‌హైడ్రాక్లోరైడ్ పిచికారీ చేయాలని సూచించారు. వారి వెంట రైతులు దిగంబర్ ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న నేతలు, ఉపాధ్యాయులు

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థిని గాజుల సౌజన్యను సోమవారం నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీలో ఎవరూ లక్షాధికారి క్విజ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి రూ.ముప్పై వేల నగదు బహుమతి అందుకుంది. సర్పంచ్‌లు బాలవ్వ, రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజనర్సింహ, లచ్చన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

మామడ: నిర్మల్‌లో మీలో ఎవరూ లక్షాధికారి కార్యక్రమంలో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.50వేల నగదు బహుమతి సాధించిన మండలంలోని పొన్కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హర్షవర్ధన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థితోపాటు తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పాఠశాల వరకు తోటి విద్యార్థులు ఊరేగింపుగా స్వాగతం పలికారు. ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, సర్పంచ్ భూమేశ్వర్, రాజారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో 'భాష్యం' ప్రతిభ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భాష్యం హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న యువన్ వరంగల్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే ఛాంపియన్‌షిప్– 2023 పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. బ్రౌంజ్ మెడల్(కాంస్య పతకం), ప్రశంసాపత్రాన్ని సినీ హీరో సుమన్ చేతుల మీదుగా అందుకున్నారు. విద్యార్థిని పాఠశాలలో కరస్పాండెంట్ కౌశిక్, అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రశాంత్, కరాటే మాస్టర్ మనీష అభినందించారు.

నట్టల నివారణ మందు పంపిణీ

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లిలో సోమవారం పశువైద్యాధికారి శ్రీనివాస్ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. గ్రామంలో 3,950 గొర్రెలు, 530 మేకలకు వేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఇందులో సర్పంచ్ పద్మ, పద్మాకర్, సిబ్బంది ప్రమోద్‌రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ముథోల్: మండలంలోని తరోడ గ్రామంలో సోమవారం ఉపాధిహామీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, సర్పంచ్ శ్వేతరవికిరణ్ గౌడ్ ప్రారంభించారు. ఆరిఫ్, ఎంపీటీసీ గంగాధర్, సురేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'కరువుభత్యం అమలు చేయాలి'

భైంసాటౌన్: బీడీ కార్మికులకు ప్రభుత్వం పెంచిన కరువుభత్యం వెంటనే అమలు చేయాలని తెలంగాణ బీడీ కామ్‌గార్ ఫెడరేషన్ నాయకులు మంత్రి నారాయణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వెయ్యి బీడీలకు మూలవేతనంపై వీడీఏతోపాటు మొత్తం రూ.232, ఉద్యోగులకు నెలకు మూలవేతనంపై అదనంగా రూ.282 కరువుభత్యం చెల్లించాలన్నారు. ఏప్రిల్ నుంచి అమలు చేయకుంటే బీడీ కార్మికులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

దర్జా కోల్పోయిన దర్జీలు..

- రెడీమేడ్ దుస్తులరాకతో ఉపాధి కరువు
- కళ తప్పుతున్న టైలరింగ్ దుకాణాలు
- భారంగా కుటుంబ పోషణ
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- నేడు టైలర్స్ డే



లోకేశ్వరంలో యాభై ఏళ్లుగా దుస్తులు కుదుతున్న భోజారాం



ధర్మోరలో టైలరింగ్ చేస్తూ కిరాణం నడుపుతున్న దర్జీ

లోకేశ్వరం: సాధారణ వస్త్రాన్ని కత్తిరించి.. కలిపి కుట్టి డ్రెస్‌గా మార్చేది దర్జీలే. కానీ వారి జీవితాల్లో మాత్రం దర్జా మాయమవుతోంది. మార్కెట్‌లో రెడీమేడ్ దుస్తులు వచ్చినప్పటి నుంచి దర్జీ(మేరు)లకు ఉపాధి తగ్గిపోయింది. గిరాకీ తగ్గడంతో తమ కుటుంబాలను పోషించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. నేడు దర్జీల దినోత్సవం(టైలర్స్ డే) సందర్భంగా ప్రత్యేక కథనం..

గతమెంతో ఘనం..

దశాబ్దకాలం కిందటి వరకు ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో టైలరింగ్ షాపులు ఉండేవి. పండుగలు, శుభకార్యాల సమయంలో ఎక్కువ మంది కుట్టించుకున్న దుస్తులనే వినియోగించేవారు. దీంతో వారి(దర్జీలకు)కి సంవత్సరమంతా చేతినిండా పని ఉండేది. భోజనం చేసే తీరిక ఉండేది కాదు.

రెడీమేడ్ దుస్తుల రాకతో దెబ్బతిన్న ఉపాధి..

రెడీమేడ్ దుస్తుల రంగప్రవేశంతో వీరి ఉపాధి పరిస్థితి దయనీయంగా మారుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లోకి వస్తున్న ఫ్యాషన్లనే కొనుగోలు చేసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. వారి అభిరుచికి అనుగుణంగా కుట్టే నేర్పు ఉన్నా.. రెడీమేడ్ దుస్తుల రాకతో వీరు ఆదరణ కోల్పోతున్నారు. దీంతో గిరాకీ లేక అనేక టైలర్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. దీంతో ఈ వృత్తిని స్వీకరించే వారి సంఖ్య కూడా తగ్గుతోంది.

గిరాకీ అంతంతే...

రెడీమేడ్ దుస్తుల రాకతో గ్రామానికి ఒకటి, రెండు మాత్రమే టైలరింగ్ షాపులు మిగిలాయి. దీనికి తోడు షర్టు, ప్యాంటు మేకర్ల కూలీతోపాటు దారం మిషన్ కాజాలు, క్లిప్స్ బటన్స్, బక్రమ్, కరెంట్ బిల్లు, దుకాణం నిర్వహణ అద్దె ఖర్చులు నిర్వాహకులకు భారంగా మారాయి. ఖర్చులు పోను ఒక డ్రెస్‌కు రూ.100 వరకు మాత్రమే మిగులుతుందని.. కేవలం పండుగల సమయంలో మాత్రమే గిరాకీ ఉంటుందని టైలరింగ్ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

జిల్లాలో..

జిల్లాలో 5,150 మేరు కుటుంబాలు ఉండగా దుస్తులు కుట్టే వృత్తిని నమ్ముకుని జీవించేవారు నాలుగు వేల మంది వరకు ఉన్నారు.

ప్రోత్సాహం కరువు...

ప్రభుత్వం వివిధ కులవృత్తులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నప్పటికీ తమకు ఎటువంటి సాయం అందించడం లేదని దర్జీలు పేర్కొంటున్నారు. చేనేతకు చేయూతనిస్తున్న ప్రభుత్వం దర్జీలకు కూడా సహకారం అందించాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు సరఫరా చేసే దుస్తులు(యూనిఫాం)ను తమకే కుట్టుకూలీ బాధ్యత అప్పగించాలని దర్జీలు కోరుతున్నారు.

పోషణ భారంగా మారింది



నేను 60 ఎళ్లుగా బట్టలు కుడుతున్నా. నాడు చేతి నిండా పని ఉండేది. అప్పట్లో బనియన్లు, చెడ్డీలు కూడా కుట్టేవాళ్లం. ఇప్పుడు అన్ని రేడీమేడ్‌గా దొరుకుతుండటంతో మాకు పని లేకుండా పోతుంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. – దొమకొండ మల్లయ్య, దర్జీ, గొడిసెర

సబ్సిడీపై రుణాలందించాలి



రెడీమేడ్ దుస్తుల రాకతో మాకు పని లేకుండా పోతుంది. దసరా పండుగ మినహా మిగతా రోజుల్లో గిరాకీ రావడం లేదు. మాకు దుస్తులు కుట్టడం తప్ప మరే ఆధారం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మాకు సబ్సిడీపై రుణాలు అందించి ప్రోత్సహించాలి. – సాయినాథ్,దర్జీ, కన్కపూర్

గిరాకీ దెబ్బతింటోంది



మార్కెట్‌లోకి కొత్త డిజైన్లు వస్తున్నాయని మా వద్దకు వచ్చేవారి సంఖ్య తగ్గింది. దీంతో లేడీస్‌టైలర్ గిరాకీ దెబ్బతింటోంది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా టైలర్లకు చేయూతనిచ్చి మా కుటుంబాలను ఆదుకోవాలి. – రేవంత్‌వార్ చిన్నక్క, దర్జీ, ధర్మోర

ఆడబిడ్డలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: పేదింటి ఆడబిడ్డలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 149 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీపీ తూము లక్ష్మీబాయి, జెడ్పీటీసీ ఆల్కాతాయి, సర్పంచ్ మీరవిజయ్, ఎంపీటీసీ పోసానిబాయి, రాజేశ్వర్, సంజయ్, శంకర్‌చౌహాన్, దత్త హరిపటేల్, పీరాజీ, సంతోశ్, తదితరులు ఉన్నారు.

'నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి'

భైంసా: నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బాసరలో సోమవారం ఆ సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ 50 ఏళ్లు దాటిన నాయీబ్రాహ్మణులకు ఫించన్‌తోపాటు దళితబంధు మాదిరి నాయీబంధు అమలు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వం అన్ని మండలకేంద్రాల్లో నాయీ బ్రాహ్మణ సంఘ భవనాలను నిర్మించాలని కోరారు.

ప్రీతి మృతిపై విచారణ జరిపించాలి



భైంసాలో సంతాపం తెలుపుతున్న విద్యార్థులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



నిర్మల్‌లో దళిత, గిరిజన సంఘాల నివాళి

ముథోల్: వైద్య విద్యార్థి ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని మండలంలోని స్థానిక నాయాబాదీ చౌరస్తా సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారత విద్యార్థి ఫెడరేషన్ ముథోల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముథోల్ డివిజన్ కార్యదర్శి పరమేశ్వర్ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: మెడికల్ పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతికి కారణమైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రీతి మృతికి సంతాపంగా పట్టణంలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం నివాళులర్పించారు. ముందుగా ప్రీతి చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు గంగప్రసాద్, విద్యార్థులు ఉన్నారు.

కడెం: ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్, హెచ్‌వోడీలపై చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: వరంగల్ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భూక్యా జానుబాయి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఇలాంటి ఘటనలు జరగకుండా ఒక చట్టం తీసుకొచ్చి అమ్మాయిలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు రజనీ వైద్య, జిల్లా ఉపాధ్యక్షురాలు వడ్లకొండ అలివేలు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వొడిసెల అర్జున్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కొండాజి శ్రావణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి భాస్కర్, వడ్నాల రాజు పాల్గొన్నారు.

దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

నిర్మల్‌టౌన్: వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి సంతాపంగా సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హిందూ వాహిని, దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానందుడి విగ్రహం నుంచి పాతబస్టాండ్ మీదుగా గాంధీచౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీచౌక్ వద్ద ప్రీతి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఖానాపూర్: వైద్యవిద్యార్థి ప్రీతి మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకట్రావ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థి మృతిపై అనుమానాలు ఉన్నాయని.. సిట్టింగ్‌జడ్జితో నిజనిర్ధారణ కమిటీ వేసి విచారణ చేయించాలన్నారు. సైఫ్ డాక్టర్ డిగ్రీని రద్దు చేసి జీవిత ఖైదు విధించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌నాయక్, నెహ్రూ, రాము, రాజేశ్వర్, ఎర్రన్న తదితరులు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: కాకతీయ మెడికల్ కళాశాల విద్యార్థి ప్రీతి ఆత్మహత్యకు కారణమైన సైఫ్‌ను ఉరి తీయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి.చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీసీ కార్యాలయంలో సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాల వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలన్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల అండ



చెక్కు అందిస్తున్న స్నేహితులు

లక్ష్మణచాంద: సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామానికి చెందిన గోల విక్రమ్(30) ఇటీవల హైదరాబాద్ నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో 2006–07లో న్యూవెల్మల్‌లో విక్రమ్‌తో కలిసి పదో తరగతి చదివిన అతడి స్నేహితులు సోమవారం బాధిత కుటుంబసభ్యులకు తాము పోగు చేసిన రూ.50వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా విక్రమ్ కుమారుడు పుట్టినరోజు కావడంతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో మిత్రబృందం నరేష్, దిలీప్, రాజు, సాయన్న, భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి

సారంగపూర్: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సంతోశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించినా.. ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు. అధికారులు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

కుంటాల: సమస్యల పరిష్కారానికి ప్రజాఫిర్యాదుల విభాగం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎంఏ కలీం పేర్కొన్నారు. సోమవారం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో పాల్గొన్నారు. కుంటాలలో 1987లో తమకు కేటాయించిన భూమి పట్టాలు ఇవ్వాలని సర్పంచ్ ఆధ్వర్యంలో 20 మంది లబ్ధిదారులు అర్జీ సమర్పించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంఈఓ ముత్యం, ఏవో సోమలింగారెడ్డి, ఎంపీఓ రహీం, పీఆర్ జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, శ్రీనివాస్, లక్ష్మి విశారద, ఏపీవో నవీన్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుపై పారుతున్న మురుగు



తానూరు: మండలంలోని హిప్నెల్లితండా గ్రామంలో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో సీసీరోడ్డుపై మురుగునీరు పారుతోంది. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు వీధుల్లో మురుగుకాల్వలు నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మోహన్‌సింగ్, ఎంపీవో ఫోన్: 98666 51826

ప్రజల భద్రత కోసమే పోలీసులు



మాట్లాడుతున్న భైంసారూరల్ సీఐ చంద్రశేఖర్

కుభీర్: ప్రజల భద్రత కోసమే పోలీసులు పనిచేస్తున్నారని భైంసారూరల్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని సొన గ్రామంలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్(కార్డన్‌సెర్చ్) ప్రోగాం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ విధానంతో ప్రజల సమస్యలతోపాటు గ్రామంలో కొత్త వ్యక్తులు, నేరస్తుల వివరాలు కూడా తెలుస్తాయన్నారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని తెలిపారు. నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 35 ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలు, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కుభీర్, భైంసారూరల్, కుంటాల ఎస్సైలు షరీఫ్, శ్రీకాంత్, సాయికిరణ్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రేవోజీపేటలో కార్డన్‌సెర్చ్

దస్తురాబాద్: నేరాల నియంత్రణకు కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని ఖానాపూర్ సీఐ బి.నారాయణనాయక్ అన్నారు. మండలంలోని రేవోజీపేట్‌లో సోమవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	20
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్
నారాయణ: వాల్తేరు వీరయ్య

కూలీలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి

ముథోల్: శనగ పంట నూర్పిడి సమయంలో కూలీలు అప్రమత్తంగా ఉండాలని ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్‌కు చెందిన నూర్పిడి యంత్ర యజమానులు, కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నూర్పిడి చేసేటప్పుడు ప్రమాదాల బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముథోల్ మండలంలోని విఠోలి, తానూర్ మండలంలోని కార్వాల గ్రామాల్లో ఇద్దరు మధ్యప్రదేశ్ యువకులు మృతి చెందడం బాధాకరమని.. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వారికి తగు సలహాలు అందజేశారు. ఎస్సై తిరుపతి, యంత్రాల యజమానులు, కూలీలు పాల్గొన్నారు.

కుంటాలలో ప్రొటోకాల్ వివాదం



ఎంపీడీవో దేవేందర్‌తో ఎంపీపీ గజ్జారాం వాగ్వాదం

కుంటాల: ప్రభుత్వం గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తుంది. సోమవారం కుంటాలలో కంటివెలుగు శిబిరం ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. మొదటగా ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్ రిబ్బన్ కట్ చేసే క్రమంలో సర్పంచ్ సమత నేనే కార్యక్రమం ప్రారంభిస్తానని పట్టుబట్టారు. దీంతో ఇరువురి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. అంతలో సర్పంచ్ అక్కడి నుండి వెళ్లిపోగా, ఎంపీపీ గంట సేపు అక్కడే ఉండి ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డిపై అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని ఎంపీపీ ఆరోపించారు. నిరీక్షిస్తున్న లబ్ధిదారులను చూసి ఎంపీపీ అక్కడ నుంచి వెనుదిరిగారు. గంట తర్వాత ఎంపీడీవో ఆదేశాల మేరకు సర్పంచ్ సమత కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు.

బాధితులకు పరామర్శ

తానూరు: మండలంలోని బెల్‌తరోడాలో గ్రామంలో ఇటీవల బాయ్ భోజన్న ఇళ్లు విద్యుతాఘాదంతో దగ్ధమైంది. బాధిత కుటుంబసభ్యులను సోమవారం ముథోల్ తాలూక మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేశ్ పరామర్శించారు. మున్నూరుకాపు సంఘం, ఎమ్మెల్యే ద్వారా ఆర్థికసాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.వారి వెంట సర్పంచ్ సాయినాథ్, తాలూక ఉపాధ్యక్షులు విఠల్, సంతోష్, సభ్యులు ఉన్నారు.

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన బెజ్జంకి రాణి అనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. సోమవారం బాధిత కుటుంబసభ్యులను పొన్కల్‌లో బీజేపీ నాయకులు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావులరాంనాథ్, గణేశ్ చక్రవర్తి పరామర్శించారు. లింగారెడ్డి, రాములు, రాజేశ్వర్, భూమయ్య ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899